# బ్రహ్మాండము దాని ఋజువు

ప్రాణాహూతి ఆధారిత ధ్యానమార్గములో శిక్షకుడు తన పిండ పరిధులను అధగమించి బ్రహ్మాండ గతుడయినట్లు తెలియపరచినారు, దాని ఋజువేమి?

ఒక వ్యక్తిని బేరీజు వేయడానికి అతని సహచర్యముండాలి. ఒకరు తన అండ, పిండ పరిధులను అధిగమించినాడా లేదన్నది ముఖ్యంగా ఆధ్యాత్మిక మార్గము ద్వారానే తెలియాలి. ఒక వ్యక్తి ఉన్నతుడా కాదా యన్నది,అతని శాస్త్ర పరిజ్ఞానముతోగాని, వంశావళి ద్వారాగాని, అనర్ఘళవాక్చాతుర్యము ద్వారా గాని మరియితర బాహ్య చిహ్నములద్వారా నిర్ణయించడము సరికాదు. కాని ఉన్నతుడు నిస్వార్ధజీవి యనేది సర్వత్రా అంగీకరించిన విషయము. దీనిని నిజజీవితములో ఎంతవరకు పాటించడము జరుగుతుందో మనకు తెలుసు. ఆ ఎల్లలు ఒకరు దాటినారా లేదాయన్నది సాహచర్యము ద్వారానే తెలియనగును. క్రింద ఉదహరించిన విషయాలు యున్నవానిని బ్రహ్మాండగతునిగా తెలియవచ్చు.

1. అతను ప్రాణాహూతి ప్రసారము చేయడానికి యితరులనుండి ధనముగా గాని, ధనేతరముగా గాని ప్రతిఫలమును ఆశించని వానిగా గమనించవచ్చు..
2. అతను చేయు ప్రాణాహూతి ద్వారా అభ్యాసీకి ఒకింత మనశ్శాంతి కలుగడము గమనించ వచ్చు.
3.అతని నడవడికలో ద్యోతకమగు నిస్వార్ధమును కొద్దిరోజుల పరిచయముతో గమనించవచ్చు.
4. అతను సత్యసంధత , అహింస పాటించుచూ భూతదయ, కరుణ వంటి ఉన్నత గుణవంతునిగా గమనించవచ్చు.
5.అతను ఏ ఒక్కరి ఎడల అనుచిత రాగము గాని, ద్వేషము లేని వానిగా గమనించవచ్చు.
6. అతను సదా తన గురువు గారి స్మరణలో యుండడము గమనించవచ్చు.
7. అతని నడవడికలోని నిరాడంబరమును గమనించవచ్చు.
8. అతని సహచర్యము ద్వారా మనలో క్రమేపి కలుగు కర్మఫలావాంఛానిరాసక్తి, విషయ వాంఛావిముఖత, కోపోద్రేకపోకడ తగ్గడము మరియు యీలాంటి పరిపక్వమైనటువంటి మానసిక పరిణామములను గమనించవచ్చు.